## మైలారంలో లెర్నింగ్ లైసెన్స్‌లు పంపిణీ

రాయపర్తి, అక్టోబర్ 3 : ఎర్రబెల్లి దయాకర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని వాహనదారులకకు ఉచితంగా అందజేస్తున్న లెర్నింగ్ లైసెన్స్‌లను మంగళవారం సర్పంచ్ లేతాకుల సుమతీయాదవరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. గ్రామ నాయకులు గబ్బెట బాబు, లేతాకుల మాధవరెడ్డి, గబ్బెట యాకయ్య, గూడెల్లి వెంకన్న, గాడిపల్లి రాములు, బండ యాదగిరి, యాకూబ్‌రెడ్డి, ఎల్లస్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలి : డీఈవో

కరీమాబాద్, అక్టోబర్ 3 : ఉపాధ్యాయులు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని డీఈవో వాసంతి సూచించారు. మంగళవారం మామునూరు జిల్లా పరిషత్ పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థులతోపాటు ప్రార్థనలో పాల్గొని తరగతులలో బోధనను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసంతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో సులభతరంగా విద్యా బోధన చేయాలన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. హెచ్ఎం శ్రీనిధిశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.


సంఘం తీర్మానం కాపీని సర్పంచ్‌కు అందిస్తున్న పరపతి సంఘం సభ్యులు

## 'అరూరి'కే ఓటు వేస్తామని పద్మశాలీల తీర్మానం

పర్వతగిరి, అక్టోబర్ 3 : మండలంలోని చింతనెక్కొండ గ్రామానికి చెందిన 40మంది పద్మశాలి పరపతి సంక్షేమ సంఘం సభ్యులు వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరూరి రమేశ్‌కే ఓట్లు వేస్తామని మంగళవారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం సర్పంచ్ గటిక సుష్మామహేశ్‌కు తీర్మానం కాపీని అందజేశారు. పద్మశాలి పరపతి సంఘానికి కమ్యూనిటీ హాల్ మంజూరు చేయడంపై వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పరపతి సంఘం అధ్యక్షుడు కుడికాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ప్రసాద్, శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.


దివిటిపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

# దేశానికి తెలంగాణ పల్లెలు ఆదర్శం

- పారదర్శకంగా అమలవుతున్న సంక్షేమ పథకాలు
- పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి
- ఎమ్మెల్యే అరూరి రమేశ్

వర్ధన్నపేట, అక్టోబర్ 3 : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులతో తెలంగాణ పల్లెలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. మండలంలోని రామవరం, దివిటిపల్లి, బండౌతాపురం, అంబేద్కర్, దమ్మన్నపేట గ్రామాల్లో రూ.10కోట్ల 41లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించడంతోపాటు పలు అభివృద్ధి పనులకు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాలు, వైకుంఠధామాలు, ప్రకృతి వనాలు, అంతర్గత సీసీరోడ్లు, నూతన పాఠశాల భవనాలు, మంచినీటి, సాగునీటి వసతి మెరుగుపడినట్లు తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా లేవన్నారు. సంక్షేమ పథకాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అర్హులైనవారికి అందిస్తున్నదని తెలిపారు. ప్రధానంగా దళితబంధు, బీసీబంధుతో పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని వివరించారు. పేదల కోసం పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు విధిగా మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

**ఎమ్మెల్యేకు ఘన స్వాగతం..**

గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వెళ్లిన ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు ప్రజలు ఘనస్వాగతం పలికారు. డప్పు వాయిద్యాలు, బతుకమ్మలతో మహిళలు ఘనంగా స్వాగతించారు. యువకులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే, ప్రభుత్వానికి మద్దతుగా నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే రమేశ్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఏఎంసీ చైర్మన్ స్వామిరాయుడు, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్‌ఖన్నా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం

### వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్

కాశీబుగ్గ, అక్టోబర్ 3 : మహిళలు అన్ని రంగాల్లో సాధికారత సాధించడంతోపాటు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ తెలిపారు. మంగళవారం ఆరెపల్లిలోని వజ్ర గార్డెన్స్‌లో 3వ డివిజన్ ఎస్ఎల్ఎఫ్ మహిళా సమాఖ్య సంఘాల వార్షిక మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అరూరి రమేశ్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో మహిళా సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్న గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. మహిళా సంఘాలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణాలు, పావలా వడ్డీ రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని సూచించారు. చాలా కాలంగా ఎదురుచూస్తున్న వీవోఏల గౌరవ వేతనాలను పెంచి మహిళలపై తన అభిమానాన్ని కేసీఆర్ చాటుకున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోలేనిదన్నారు. సీఎం కేసీఆర్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలువాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి అధ్యక్షురాలు ఎల్లావుల లలితాకుమార్‌యాదవ్, కార్పొరేటర్ జన్ను షీభారాణీఅనిల్, 10 గ్రామ సమైక్యల ఆర్పీలు, అధ్యక్షకార్యదర్శులు, మహిళలు పాల్గొన్నారు.


మహిళలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

## చాంబర్ వజ్రోత్సవ వేడుకల విజయవంతంపై కృతజ్ఞతలు

కాశీబుగ్గ, అక్టోబర్ 3 : వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ 75వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వజ్రోత్సవ ఉత్సవాలు సమిష్టి కృషితో అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి తెలిపారు. తమ ఆహ్వానాన్ని మన్నించి ఉత్సవాలకు హాజరై అపూర్వ సందేశాలతో వినూత్న ఆలోచనలు కలిగింపచేసినందుకు అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి, పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్‌కు, ఎంపీ పసునూరి దయాకర్, ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌బాస్కర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, అరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, మేయర్ గుండు సుధారాణి, జడ్పీచైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, రోడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లం సంపత్‌కుమార్‌కు, వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్‌కు, జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు, మార్కెటింగ్‌శాఖ జేడీఎం ఎన్నారపు మల్లేశం, డీడీఎం అజ్మీరా రాజునాయక్, డీఎంవో పాలకుర్తి ప్రసాద్‌రావుకు, కార్యదర్శి బరుపాటి వెంకటేశ్ రాహుల్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే టీఎన్జీవోస్ నాయకులకు, మార్కెట్ పరిధిలోని దడ్వాయి, గుమస్తా, హమాలీ, ఇతర కార్మిక వర్గాలకు, రైతులకు చాంబర్ అధ్యక్షకార్యదర్శులు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, మాడురి వేదప్రకాశ్‌లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కళాకారులకు డప్పులు పంపిణీ

పర్వతగిరి, అక్టోబరు 3 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన కళాకారులకు మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఆదేశాల మేరకు డప్పులను పంపిణీ చేశారు. సీపీ కొయ్యల రాజు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు అమడగాని రాజు, పర్వతగిరి సర్పంచ్ చింతపట్ల మాలతీసోమేశ్వర్‌రావు, ఎంపీటీసీలు మాడుగుల రాజు, మౌనిక రాజు, సర్పంచ్ వర్కాల రమేశ్, ఉపసర్పంచ్ రంగు జనార్దన్ గౌడ్, ఆర్పీఎస్ కన్వీనర్ చిన్నపాక శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ బొట్ల మధు, చిన్నపెల్లి అజయ్, యాకయ్య, వెంకన్న పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

దామెర, అక్టోబర్ 3 : మండల కేంద్రానికి చెందిన వంగ రమేశ్(40) మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపారు. రమేశ్ తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా స్థానికులు గమనించి ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ అశోక్‌రెడ్డి, అధ్యాపకులు

## కిట్స్‌లో ఐఈఈఈ వేడుకలు

హసన్‌పర్తి, అక్టోబర్ 3 : ఎర్రగట్టుగుట్ట సమీపంలో కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐఈఈఈ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అశోక్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా వేలాది మంది ఐఈఈఈ సభ్యులతో జరుపుకున్న ఐఈఈఈ డే 2023కి సంబంధించి ఇంజినీరింగ్ విద్యార్థి సంఘానికి అవగాహన కల్పించినట్లు సూచించారు. ఐఈఈఈ హార్డ్‌వేర్ డోమైన్ ఆధారంగా నూతన పోకడల కలిగించే సాంకేతికలపైన దృష్టి సారించాల=న్నారు. అనంతరం ఐఈఈఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు కోమల్‌రెడ్డి, ఆర్విచలం, గోపాల్, అసోసియేట్ ప్రొఫెసర్ ప్రభాకరాచారి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

రాయపర్తి, అక్టోబర్ 3 : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం బీఆర్ఎస్ మండల ఎన్నికల ఇన్‌చార్జి గుడిపూడి గోపాల్‌రావు పర్యటించారు. ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన గూబ లావణ్య, ఏసీరెడ్డి వెంకన్న, మంద యాకూబ్‌రెడ్డి, కొనకటి ఎల్లమ్మ, మల్లయ్య, గద్దల ఉపేందర్, చెడుపాక వెంకన్న, ఎనగందుల సంపత్, బొమ్మెర వెంకటనారాయణలను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహానాయక్, జడ్పీటీసీ రంగుకుమార్, మండల నాయకులు పూస మధు, సర్పంచ్ గూబ యాకమ్మ ఎల్లయ్య, గొట్టం ప్రతాప్‌రెడ్డి, కుమారస్వామి, గబ్బెట బాబు, మల్లయ్య, మంద రాజు పాల్గొన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న గుడిపూడి గోపాల్‌రావు

## స్వామినాథన్‌కు ఘన నివాళి

కాశీబుగ్గ, అక్టోబర్ 3 : భారత దేశ హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ సంతాప సభను మంగళవారం పైడిపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఆర్ ఉమారెడ్డి స్వామినాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత్‌దేశంలో స్వామినాథన్ వ్యవసాయ రంగానికి చేసిన సేవలను గుర్తు చేశారు. అధిక దిగుబడులు వచ్చే విధంగా అనేక వ్యవసాయ ఉత్పత్తులపై పరిశోధనలు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా అధిక దిగుబడి ఇచ్చే వరి, గోధుమ, వంగడాలను సృష్టించి దేశంలోని రైతులకు అధిక ఆదాయం వచ్చేలా చేసిన గొప్ప శాస్త్రవేత్త అని కొనియాడారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఇతర అధికారులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


స్వామినాథన్ సంతాప సభలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు

## ల్యాదెల్లలో యువకుడు అదృశ్యం

### మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు

దామెర, అక్టోబర్ 3 : మండలంలోని ల్యాదెల్ల గ్రామంలోని చికెన్‌సెంటర్‌లో పని చేస్తున్న దొనికెల శ్రీకాంత్ మూడు రోజుల క్రితం అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. మంగళవారం ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన ప్రకారం.. కమలాపురం మండలం గూనిపర్తికి చెందిన శ్రీకాంత్ ల్యాదెల్లలో ఓ చికెన్‌సెంటర్‌లో పని చేస్తున్నాడు. సెప్టెంబర్ 30న గూనిపర్తి నుంచి బయల్దేరి ల్యాదెల్లకు చేరుకున్నట్లు శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించాడు. ఈ నెల 1న శ్రీకాంత్ చికెన్‌సెంటర్‌లో లేడని యజమాని శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు తెలిపాడు. కుటుంబ సభ్యులు ల్యాదెల్లకు చేరుకుని శ్రీకాంత్‌కోసం వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. శ్రీకాంత్ నలుపురంగులో ఉంటాడని, నలుపు రంగు ప్యాంటు, ఎరుపురంగు డబ్బాల షర్టు ధరించి ఉన్నాడని, వివరాలు తెలిసినవారు సెల్ నంబర్ 8712685220,8712685228కు సమాచారం ఇవ్వాలని ఎస్సై ముత్యం రాజేందర్ కోరారు.